క్లుప్తంగా

ఐదు నీటి ట్యాంకర్లు సీజ్



ట్యాంకర్‌ను సీజ్ చేసిన అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అక్రమంగా తరలిస్తున్న నీటి ట్యాంకర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ శివారు ప్రాంతంలో ట్యాంకర్లతో నీటిని నగరానికి తరలిస్తున్నారు. ఈ విషయాన్ని గురువారం స్థానికులు అధికారుల దృష్టికి తెచ్చారు. దీంతో తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో నీటిని తరలిస్తున్న ఐదు ట్యాంకర్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐదు ట్యాంకర్లలను సీజ్ చేయటంతో పాటు నీటిని నిల్వ చేసే వాటిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొల్లూరు ఎస్ఐ రమేష్, ఆర్ఐ శ్రీకాంత్‌లున్నారు.

అదుపుతప్పితే అంతే..



ప్రమాదకరంగా రోడ్డు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు నుంచి ఈదుల నాగులపల్లికి వెళ్లే మార్గం ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. కొల్లూరు శివారులోని రోడ్డు ధ్వంసమైంది. గతకొన్ని నెలలుగా రోడ్డు దుస్థితి దారుణంగా ఉంది. అయినా అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ఈమార్గంలో వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ప్రశంసలు



ప్రశంసాపత్రం అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ తిరుపతి

జోగిపేట(అందోల్): అందోల్ –జోగిపేట పురపాలక సంఘం ఆస్తిపన్ను 75 శాతంపైగా అధికారులు వసూలు చేశారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్.తిరుపతిని రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులు డాక్టర్ శ్రీదేవి గురువారం హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయంలో ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. మున్సిపాలిటీకి రూ.1.09 కోట్లు ఆస్తిపన్ను టార్గెట్ కాగా, రూ.83 లక్షలు వసూలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేకంగా గ్రూపులను ఏర్పాటు చేసి వసూళ్లు రాబట్టారు. జిల్లా స్థాయిలో ఆస్తిపన్ను వసూళ్లలో ద్వితీయ స్థానంలో నిలవడానికి సహకరించిన సిబ్బందికి కమిషనర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

రోడ్డు విస్తరణకు మార్కింగ్



మార్కింగ్ చేస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రం వట్‌పల్లిలో నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి ఆర్ అండ్‌బీ అధికారులు విస్తరణలో భాగంగా గురువారం స్థలం మార్కింగ్ చేశారు. కిలోమీటరు మేర సెంటర్ లైటింగ్, నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వం నుంచి రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇటీవల టెండర్ కూడా పూర్తయినట్లు ఆర్అండ్‌బి ఏఈ శశాంక్ తెలిపారు. రోడ్డు సెంటర్ నుంచి రెండు వైపులా 60 ఫీట్లలోపు రోడ్డును ఆనుకొని నిర్మాణాలు చేపట్టిన ఇళ్లు, దుకాణదారుల యజమానులకు ఇప్పటికే నోటీసులు అందజేశామని చెప్పారు. వారం రోజుల్లో వాటిని తొలగించాలని సూచించినట్లు పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శంభీరెడ్డి, ఆర్అండ్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

కొండాపూర్(సంగారెడ్డి): నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు సీఎం రీలీఫ్ ఫండ్ ఎంతగానో దోహదం చేస్తుందని ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు అన్నారు. గురువారం మండలంలోని 23 మంది లబ్ధిదారులకు రూ.12 లక్షల 500 చెక్కులను పంపిణీ చేశారు.

అందరికీ అందుబాటులో న్యాయం

- దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం
- చకచకా కోర్టు ఏర్పాటు పనులు
- ఆనందంలో మండలవాసులు

జిన్నారం (పటాన్‌చెరు): పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక కేసుల్లో సత్వర న్యాయం జరగాలంటే న్యాయసేవలు అందుబాటులో ఉండాలి. జిన్నారం మండలంలో ఎన్నో ఏళ్లుగా కోర్టు లేకపోవడంతో సివిల్, జ్యుడీషియల్ కేసులకు సంబంధించి బాధితులు న్యాయం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి. ఇందుకు 40 కిలోమీటర్లు ప్రయాణించి న్యాయసేవలు పొందాల్సి వస్తోంది. అయితే స్థానిక నాయకులు, బార్ కౌన్సిల్ సభ్యుల సమన్వయంతో మండలానికి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, జ్యుడీషియల్ కోర్టు మంజూరయింది.



కోర్టు తాత్కాలిక భవనం

చకచకా మర్మమతు పనులు

కోర్టు ఏర్పాటుకు స్థానిక నాయకులు, బార్ కౌన్సిల్ సభ్యులు చూపిన చొరవపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బొల్లారం మునిపాలిటీ, జిన్నారం సర్కిల్ పరిధిలోని గుమ్మడిదల, హత్నూర, జిన్నారం మండలాల్లో గత ఎన్నోఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి న్యాయ సేవలు తప్పనిసరి. ఆ దిశగా స్థానిక మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్, జిల్లా బార్ అసోసియేషన్ సభ్యుల సహకారంతో కోర్టు ఏర్పాటుకు బీజం పడింది. తాసీల్దార్ కార్యాలయంలోని శ్రీశక్తి భవనం కోర్టు తాత్కాలిక కార్యకలాపాలకు అనువుగా ఉంటుందని మరమ్మతులు ప్రారంభించారు. ఎప్పుడెప్పుడు న్యాయ సేవలు అందుబాటులోకి వస్తాయని ఎదురుచూస్తున్న మండల ప్రజలు పనులు ప్రారంభమవడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు



కోర్టు భవనం ఏర్పాటు కానుండడంతో మండల అభివృద్ధి శరవేగంగా జరుగుతుంది. సర్కిల్ పరిధిలోని మూడు మండలాల్లో, సివిల్ జ్యూడిషియల్ కేసుల పరిష్కారానికి కోర్టు ద్వారా బాధితులకు సత్వర న్యాయం జరుగుతుంది. ప్రస్తుతం తాత్కాలిక భవనంలో మరమ్మతులు ప్రారంభించాం. వచ్చే నెల 10 వరకు పనులు పూర్తి చేసుకొని 15వ తేదీ తర్వాత కోర్టు అందుబాటులోకి వచ్చేలా చూస్తాం. కోర్టు ఏర్పాటుకు సహకరించిన హైకోర్టు లాయర్లకు, జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు.

– రవీందర్ గౌడ్ (జిన్నారం మాజీ ఎంపీపీ)

అందుబాటులో న్యాయ సేవలు



సివిల్ జ్యూడిషియల్ కేసుల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు కోర్టు ద్వారా సత్వర న్యాయం అందుతుంది. గతంలో 40 కిలోమీటర్లు వెళ్లి న్యాయ సేవలు పొందేవారు. మండలంలో కోర్టు ఏర్పడితే కాలయాపన లేకుండా కేసులు పరిష్కరించబడతాయి. అన్యాయంపై ప్రతి ఒక్కరు కోర్టును ఆశ్రయించి న్యాయం పొందే అవకాశం ఉంటుంది. చట్టాలపై అవగాహన కలుగుతుంది.

– శ్రీధర్ రెడ్డి , నర్సాపూర్, బార్ కౌన్సిల్ అసోసియేషన్ అధ్యక్షుడు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి



బహుమతులను అందజేస్తున్న డీఎస్పీ తదితరులు

జహీరాబాద్ టౌన్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, చదువును ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దని జహీరాబాద్ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. చదువుతోనే విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి చెందుతారని చెప్పారు. సీఐ.శివలింగం మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఏ స్థాయిలో ఉన్న గురువులు, కళాశాలను మరువద్దన్నారు. ఈ సందర్భంగా చదువుల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షురాలు షీలా రమేష్, ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్ధారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మారుతిరావు, డైరెక్టర్లు అమర్‌నాథ్, శంకర్‌రావు, పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీలో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపరచగా జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య

రాయికోడ్(అందోల్): పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ నాగారం గొల్ల అంజయ్య పేర్కొన్నారు. మండలంలోని రాయిపల్లి, సంగాపూర్ గ్రామాల్లో గురువారం సన్న బియ్యం పథకాన్ని స్థానిక నాయకులతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాయిపల్లి, సంగాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలను ప్రాధాన్యతల వారీగా అమలు చేస్తోందన్నారు. నిరుపేదల కోసం సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించినందుకుగాను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదరలకు లబ్ధిదారుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీరభద్ర ఆలయ కమిటీ చైర్మన్ సతీశ్ కులకర్ణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలు, మాజీ ఏఎంసీ చైర్మన్ కేదరీనాథ్ పాటిల్, తహసీల్దార్ శ్రీనివాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణంపై అభ్యంతరం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దమ్మగూడెం గ్రామంలో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై నుంచి నిర్మాణ పనులు చేపట్టడం సరికాదని గ్రామానికి చెందిన పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న కాల్వ నుంచి అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించాలన్నారు. అలాచేస్తే రోడ్డు ధ్వంసం కాకుండా ప్రజలకు ఇబ్బందులు తలెత్తవని సూచించారు. రోడ్డుపైన చేపడుతున్న నిర్మాణ పనులను ఆపాలని డిమాండ్ చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ మంత్రి, నాయకులు

మాజీ మంత్రి చంద్రశేఖర్

ఝరాసంగం(జహీరాబాద్): భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మాజీ మంత్రి చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని బర్దిపూర్ గ్రామంలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటు సాక్షిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానించేలా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ పదవిని భర్తీ చేయాలి

కంగ్టి(నారాయణఖేడ్): నారాయణఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని ఎమ్మార్పీఎస్ తడ్కల్ క్లస్టర్ అధ్యక్షుడు లాల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఖేడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఉన్నత వర్గాలకే నియమించి బడుగు వర్గాలకు విస్మరించారని విమర్శించారు. గురువారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే, ఎంపీలు బడుగు వర్గాలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. చైర్మన్ పదవి మాదిగ వర్గానికి కేటాయించని పక్షంలో 20 వేల డప్పులతో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంజయ్య, మొగులయ్య, సాయులు, మెత్రి సాయులు, జైపాల్, డేవిడ్, రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హరీశ్‌రావును కలిసిన ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును గురువారం కార్పొరేటర్ సింధూరెడ్డి, నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా నియమించినందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినట్లు వివరించారు.



సంక్షిప్త వార్తలు

◆ చెరువు కట్ట పనులు ప్రారంభం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం వావిలాల గ్రామ శివారులోని పీర్లాది చెరువుకట్ట నిర్మాణ పనులను మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుకట్ట నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని అధికారులను కోరారు. పనులను సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ శ్రీరామ నవమి కరపత్రాల పంపిణీ

మునిపల్లి(అందోల్): టెక్మాల్ మండలం వెల్పుకొండలో ఈ నెల 6న నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణానికి సంబంధించిన కరపత్రాలను నర్సాపూర్ మండలం రుస్తుంపేట (నృసింహాపూరం) ఆత్మానందాశ్రమ అధ్యక్షుడు భానుప్రకాశ్ ఆయా గ్రామాల్లో పంపిణీ చేశారు. గురువారం మండలంలోని తాటిపల్లి, మక్తక్యాసారం, పొల్కంపల్లి గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో కరపత్రాలను భక్తులకు అందజేశారు.

◆ పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

హత్నూర (సంగారెడ్డి): అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నవారికి సీఎం సహాయనిధి ఓ వరంలా మారిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో కలసి హత్నూర మండలానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.13. 15 లక్షల విలువైన చెక్కులను అందజేశారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



పటాన్‌చెరు: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్‌కు చెందిన సురేందర్‌రావు కుమార్తె కీర్తి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే ద్వారా సీఎం ఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకోగా.. ఈ మేరకు మంజూరైన రూ.2.60లక్షల విలువైన ఎల్ఓసీని కీర్తి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, మాణిక్ ప్రభు, శ్రీ రాములు, రాజన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

◆ రామాలయంలో హరికథ కాలక్షేపం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రామ మందిరంలో గురువారం రాత్రి కర్నాటక రాష్ట్రంలోని తాదలపూర్‌కు చెందిన వైకుంఠ దత్తు మహరాజ్‌చే హరికథ గానం నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని వారం రోజుల పాటు హరికథ కాలక్షేపం కొనసాగనుంది. రామాయణంపై దత్తు మహరాజ్ గానం చేసిన హరికథ భక్తులను ఆకట్టుకుంది.

◆ 9,10 తేదీల్లో బస్‌పాస్ మేళా

వట్‌పల్లి(అందోల్): దివ్యాంగులకు నారాయణఖేడ్ డిపో మేనేజర్ మల్లేశం ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీల్లో వట్‌పల్లి మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉచిత బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు ఆర్టీసీ సిబ్బంది శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల బస్‌పాస్ తీసుకునేవారు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఫొటో అందజేయడంతో పాటు రూ.50 చెల్లించాలన్నారు. మండలంలోని దివ్యాంగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ ఘనంగా బోనాల పండుగ



రాయికోడ్(అందోల్): మండలంలోని ధర్మాపూర్ శివారులో వెలసిన లలిత కోటి పర్తీవా లింగ దేవస్థాన అవరణలో కాలభైరవ విగ్రహం, ధ్వజ స్తంభ స్థాపన ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని భక్తులు బోనమెత్తి ఊరేగింపుగా పుర విధుల గుండా ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, నృత్యాలు అకట్టుకున్నాయి. ఆలయంలో నిరంతరం జన, సంకీర్తన, కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

◆ దొడ్డి కొమురయ్యకు నివాళి

నారాయణఖేడ్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు దొడ్డి కొమురయ్య జయంతిని గురువారం ఖేడ్‌లో ఘనంగా నిర్వహించారు. ఖేడ్ మండలం జూకల్ శివారులోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వదద్దున్న దొడ్డి కొమురయ్య విగ్రహానికి డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పరశురాంరాథోడ్, రాజు, రవీందర్, కురుమసంఘ బాధ్యులు మల్గొండ, అనిల్, భీమన్న పాల్గొన్నారు.

◆ వ్యక్తి అదృశ్యం



సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని మద్దికుంట గ్రామంలో చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి రుద్రయ్య(38), ప్రవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 2న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికిన ఆచూకీ దొరకలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

◆ భక్తులకు అంబలి పంపిణీ

నారాయణఖేడ్: ఖేడ్ మండలం హన్మంతరావుపేట్‌లో వేంకటేశ్వరాస్వామి జాతర మహోత్సవాలు, కంగ్టి మండలం బాన్సువాడ(డి)లో జాతర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జాతరలకు హాజరైన భక్తులకు గురువారం ఖేడ్ జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మశ్చందర్ సూచన మేరకు ఫౌండేషన్ ప్రతినిధులు హర్షవర్ధన్‌రెడ్డి, తుకారాం, శ్రీనివాస్, అభిపవార్ అంబలిని పంపిణీ చేశారు.

◆ ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని పెద్దమ్మ ఆలయంలో రామచంద్రాపురం జిల్లా పరిషత్ పాఠశాల 1991–92 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వవిద్యార్థులు గురువారం సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కృష్ణమూర్తి, దేవా, చంద్రశేఖర్‌రెడ్డి, రాజేందర్, సుభాష్, యాదగిరి పాల్గొన్నారు.



ప్రతి లబ్ధిదారుకు సన్నబియ్యం

మునిపల్లి(అందోల్): ప్రతి లబ్ధిదారుకు సన్న బియ్యం సరఫరా చేయనున్నట్లు మాజీ ఎంపీపీ రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటలక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ అంజిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తాటిపల్లి గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాబోయే రోజుల్లో రేషన్‌కార్డు ఉన్న లబ్ధిదారులందరికి 9 రకాల నిత్యావసర సరుకులను ప్రభుత్వం సరఫరా చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పెంటయ్య, రాయికోడ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మైపాల్, రేషన్ డీలర్ శ్రీనివాస్‌రెడ్డి, దర్జి మారుతి, మాణయ్య, గొల్ల శ్రీశైలం, ఇడ్డి దుర్గయ్య, ప్రతాప్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

సన్నబియ్యం పేదలకు వరం

వట్‌పల్లి(అందోల్): సన్నబియ్యం పంపిణీ పేదల పాలిట వరమని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం అందోల్ మండలంలోని కన్‌సాన్‌పల్లిలో ఉచిత బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. ఇందులో భాగంగా ఉచిత సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ బి.క్రిష్ణ, కార్యదర్శి నాగరాజు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాలయ్య, నాయకులు మహిపాల్, క్రిష్ణ, రమేశ్‌గౌడ్, వీరన్న పాల్గొన్నారు.



మునిపల్లి(అందోల్): రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు తదితరులు

విద్యార్థులపై శ్రద్ధ వహించాలి

ఆర్డీఓ అశోక్ చక్రవర్తి

కల్హేర్,(నారాయణఖేడ్): విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి పేర్కొన్నారు. గురువారం సిర్గాపూర్ మండలం నల్లవాగులో సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఇటీవల గురుకులంలో 9వ తరగతి విద్యార్థి నిఖిల్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఆర్డీఓ గురుకులాన్ని సందర్శించి.. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గురుకులంలోని విద్యార్థులకు ప్రతి నెల వైద్యపరీక్షలు చేయించాలని ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమంపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమశంకర్ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

150 మంది విద్యార్థులకు కరాటే పరీక్షలు



కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులు

జోగిపేట(అందోల్): బాలికల ఆత్మరక్షణ ఎంతో అవసరమని పాఠశాలల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విద్యార్థినులు వినియోగించుకోవాలని అందోల్ టీఎస్ డబ్ల్యూఆర్ ఈఎస్ వైస్ ప్రిన్సిపాల్ భవాని అన్నారు. గురువారం టీఎస్ డబ్ల్యూఆర్ ఈఎస్ ఆవరణలో వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ పోచయ్య ఆధ్వర్యంలో సుమారు 150 మంది విద్యార్థినులకు ప్రత్యేక బెల్ట్ ఎగ్జామ్స్ నిర్వహించారు. విద్యార్థినులు ప్రతిభను కనబరిచి బెల్టులు, సర్టిఫికెట్లు కైవసం చేసుకున్నారు. భవాని మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా పాఠశాల ఆవరణలో మార్షల్ ఆర్ట్స్ సెల్ఫ్ డిఫెన్స్ నేర్పించడం ఎంతో ఆనందదాయకమని అన్నారు.

పకడ్బందీగా ‘ఓపెన్’ పరీక్షలు

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి(ఎడ్యుకేషన్): జిల్లాలో ఓపెన్‌కు సంబంధించిన పది, ఇంటర్మీడియెట్ పరీక్షలను ఎలాంటి అవకతవకలు లేకుండా పకడ్బందీగా, ప్రశాంతగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఓపెన్ పరీక్షలపై వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రెగ్యులర్ పరీక్షల మాదిరిగానే ఓపెన్ పరీక్షలకు కూడా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

టెన్త్‌కు 09...ఇంటర్‌కు 15 కేంద్రాలు

జిల్లాలో ఓపెన్ పరీక్షలకు సంబంధించి పదో తరగతికి 09 పరీక్ష కేంద్రాలు, ఇంటర్మీడియెట్‌కు 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చంద్రశేఖర్ తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు 2,195, ఇంటర్మీడియెట్ పరీక్షలకు 4,334 మంది అభ్యాసకులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ పరీక్షలు పదవ తరగతికి ఉ. 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని, ఇంటర్మీడియెట్‌కు మధ్యాహ్నం 2–30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు.



సమావేశంలో అదనపు కలెక్టర్, అధికారులు

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని మార్కండేయ నగర్లో గురువారం రూ. 11.25 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని వెల్టూర్‌లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిజాంపూర్‌లో నీటి ఎద్దడిని తీర్చేందుకు గ్రామ నాయకుల విజ్ఞప్తి మేరకు బోరు మోటారును ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, వైస్ చైర్మన్ కృష్ణ,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్ధన్న , నాయకులు పాల్గొన్నారు.



మార్కండేయ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నిర్మలారెడ్డి